ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

5

గురువారం 12 సెప్టెంబరు 2024



విషజ్వరంతో మహిళ మృతి



జ్యోతి (ఫైల్)

ములుగు, సెప్టెంబరు 11: విషజ్వరంతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా కేంద్రంలో బుధవార చోటుచేసుకుంది. గొల్లవాడకు చెందిన వంగల జ్యోతి(48) వారంరోజుల క్రితం జ్వరం బారిన పడింది. స్థానికంగా వైద్యం పొందినప్పటికీ తగ్గలేదు. దీంతో రెండురోజుల క్రితం ఆమెను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ జ్యోతి మృతిచెందింది.

రామప్ప కీర్తిని పెంచేలా అభివృద్ధి

సహజత్వాన్ని కాపాడుతూనే పనులు చేపట్టాలి

రాష్ట్ర సచివాలయంలో అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు, సెప్టెంబరు 11: ప్రపంచ వారసత్వ కట్టడంగా యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ కీర్తిని పెంచే విధంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో పురావస్తు, టూరిజం ఉన్నతాధికారులతో మంత్రి బుధవారం సమావేశమయ్యారు. కలెక్టర్ టీఎస్.దివాకర, ఇన్‌టాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు, మాజీ ఐఏఎస్ పాపారావు పాల్గొన్నారు. తెలంగాణ నుంచి యునెస్కో గుర్తింపు పొందిన ఏకైక కట్టడం రామప్ప కాగా, ములుగు జిల్లాలో ఉండటం గర్వకారణమని సీతక్క అన్నారు. చుట్టుపక్కల బొగత జలపాతం, లక్నవరం, మేడారం సమ్మక్క, సారలమ్మ, మల్లూరు క్షేత్రం వంటి పర్యాటక, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశా లన్నాయని, ప్రణాళికాబద్ధంగా వీటిని అభివృద్ధి చేస్తామన్నారు. రామప్పలో చేపట్టిన పనులను గడువులోగా పూర్తిచేసేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు లోపించినా, అలసత్వం వహించినా చరిత్ర, ప్రజలు క్షమించరని సూచించారు. ములుగులో జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం కూడా నిర్మాణం కాబోతోందని, రామప్ప చుట్టుపక్కల సహజత్వాన్ని కాపాడుతూనే అభివృద్ధి చేయాలని తెలిపారు. పురాతన కట్టడాలు, చెరువుకు హాని కలిగించే పనులకు అనుమతులు ఇవ్వబోమని స్పష్టం చేశారు. రామప్ప గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు, ప్రపంచానికి చాటిచెప్పేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఆలయంతోపాటు చెరువులను సుందరీకరించాలని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి: కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 11: పద్దెనిమిది ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌శర్మ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. నూతన ఓటరు నమోదు, అడ్రెస్ మార్పిడి, పోలింగ్ కేంద్రం మార్పునకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా బూత్‌లెవల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరినీనూతన ఓటరుగా నమోదు చేస్తారని తెలిపారు. 2025 జనవరి 1 వరకు 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు నమోదుకు అర్హులని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఉన్న జాబితాను సరిచూసుకోవడానికి అక్టోబరు 19 నుంచి 28 వరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచనున్నట్లు వివరించారు. అక్టోబరు 29న ఓటరు ముసాయిదా ప్రకటిస్తామని, నవంబరు 28 వరకు అభ్యంతరాలు స్వీకరించి, డిసెంబరు 24 వరకు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. 2025 జనవరి 6న ఓటరు తుది జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు.

ఇంకెన్నేళ్లు?

త్రిశంకు స్వర్గంలో మేడిగడ్డ భవితవ్యం!



కుంగుపాటుకు గురైన లక్ష్మీ (మేడిగడ్డ) బ్యారేజ్

- ఇంకా కొలిక్కి రాని ఎన్డీఎస్ఏ పరీక్షలు
- కేవలం ఏడో బ్లాకులోనే పూర్తి
- ఇంకా ఏడు బ్లాకులు 72 పిల్లర్ల పరీక్షలు పెండింగ్‌లోనే
- మరమ్మతులకు మరో ఏడాది పట్టే అవకాశం
- ఇప్పటికే 1500 టీఎంసీలు సముద్రంపాలు
- ఎత్తిపోతలకు అవకాశమున్నా పట్టించుకోని సర్కారు

భూపాలపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ల కుంగుబాటు, ఆ తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలను చూస్తుంటే ఈ ప్రాజెక్టు త్రిశంకుస్వర్గంలో కొట్టుమిట్టాడుతోందని తెలుస్తోంది. 2023 అక్టోబరులో లక్ష్మీ (మేడిగడ్డ) బ్యారేజీలోని ఏడో బ్లాకులో పిల్లర్లు కుంగిన తర్వాత ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితుల అధ్యాయనానికి శ్రీకారం చుట్టింది. బ్యారేజీ దెబ్బతినేందుకు దారితీసిన పరిస్థితులేమిటనే విషయాన్ని తేల్చేందుకు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీకి బాధ్యతలను అప్పగించింది. ఈ క్రమంలో ఎన్డీఎస్ఏకు చెందిన నిపుణుల బృందం పలు దఫాలుగా పర్యటించి ఏడోబ్లాక్‌లో లోపాలను అధ్యయనం చేసింది. జియో ఫిజికల్, జియో టెక్నికల్ లాంటి పరీక్షలు కూడా జరపాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రెండు నెలల పాటు నిపుణులు ఏడో బ్లాక్‌లో అణువణువూ పరీక్షించారు. ఈ క్రమంలో దెబ్బతిన్న బ్లాక్‌లోని పియర్ల వద్ద సీకెంట్ పైల్స్ అమరికను తెలుసుకునేందుకు డ్రిల్లింగ్ చేసి మట్టి నమూనాలను పరీక్షించాల్సి ఉందని తెలుస్తోంది. అలాగే ఇంకా కొన్ని ఇతర సాంకేతిక పరీక్షలు కూడా నిర్వహించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో వరదలు ప్రారంభం కావడంతో తనిఖీల ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం ఏడోబ్లాక్‌లో పరీక్షల ప్రక్రియ చివరి అంకానికి చేరినా మిగతా ఏడు బ్లాకుల్లోని 72 పిల్లర్లను కూడా పరీక్షించాల్సిన పరిస్థితి ఉందని నీటిపారుదల శాఖ నిపుణులు అంటున్నారు. ఎన్డీఎస్ఏ బిజీ షెడ్యూల్ నేపథ్యంలో తనిఖీల ప్రక్రియ మరింత జాప్యమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఒక్కో బ్లాక్‌లో పరీక్షలకు తీసుకుంటున్న సమయాన్ని పరిగణనలోకి తీసుకుంటే రెగ్యులర్‌గా టెస్టులు జరిపినా ఏడాది కాలం పాటు తనిఖీలకే సమయం పడుతుందని, ఆ తర్వాత కొత్త కోడ్ అభివృద్ధిపరిచి మరమ్మతుల ప్రక్రియ పూర్తి చేయాలంటే మరింత సమయం పట్టే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే మరో రెండేళ్ల తర్వాత కానీ మేడిగడ్డ బ్యారేజీ తిరిగి అందుబాటులోకి వచ్చే పరిస్థితి ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే.. మేడిగడ్డ బ్యారేజీకి ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టే యోజన చేస్తుండటంతో కాళేశ్వరం ప్రాజెక్టుల భవిష్యత్తు డోలాయమానంలో పడిందని తెలుస్తోంది. ఇందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టేందుకు ఈ ఏడాది బడ్జెట్లో రూ.700 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే.

ఎత్తిపోతలకు అవకాశమున్నా...

మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు కుంగుబాటు, లీకేజీల కారణంగా దెబ్బతిన్నప్పటికీ మహదేవపూర్ మండలం కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా రోజుకు 3టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉంది. కానీ ప్రభుత్వం ఏ కారణం చేతో పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఎల్లంపల్లి నుంచి గోదావరి జలాలను పెద్దపల్లి జిల్లా నంది మేడారంలోని నంది పంప్‌హౌస్ ద్వారా మిడ్ మానేరుకు ఎత్తిపోస్తున్నారు. ఏడు పంపుసెట్ల ద్వారా 22 వేల 50 క్యూసెక్కుల (2టీఎంసీలు) నీటిని మిడ్ మానేరుకు ఎత్తిపోసే అవకాశం ఉన్నా కేవలం నాలుగు పంపుసెట్ల (ఒక్కో మోటార్ సామర్థ్యం 3150 క్యూసెక్కులు) సాయంతో ఎత్తిపోస్తున్నారు. అదే కన్నేపల్లి పంప్ హౌస్ నుంచి ఎత్తిపోతల జరిపితే సగటున రోజుకు మూడు టీఎంసీల నీటిని ఎగువన ఉన్న రిజర్వాయర్లను నింపే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. రెండు నెలలుగా గోదావరికి వరద పెద్ద ఎత్తున వస్తున్న నేపథ్యంలో లక్ష్మీబ్యారేజ్‌తో సంబంధం లేకుండా నీటిని ఎత్తిపోయొచ్చని నీటిపారుదల శాఖ ఇంజనీర్లు కూడా చెబుతున్నారు. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయాలన్న డిమాండ్ విపక్షాల నుంచి బలంగా వినిపిస్తున్నా సర్కారు పెడచెవిన పెడుతుండడం వెనక ఆంతర్యమేమిటనేది ఎవరికీ అంతు చిక్కడం లేదు. గడచిన రెండు నెలల కాలంలో సగటున రోజూ 70 నుంచి 80టీఎంసీల నీరు వృథాగా సముద్రం పాలైందని తెలుస్తోంది. మేడిగడ్డ బ్యారేజ్ వద్ద ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 1,500 టీఎంసీల వరద నీరు వృథాగా సముద్రంలో కలిసిందని నీటిపారుదల శాఖ అధికారులు అంటున్నారు.



బ్యారేజీని పరీక్షిస్తున్న నిపుణుల బృందం

మేడిగడ్డ బ్యారేజీలో ఏడీసీపీ సర్వే

- ప్రవాహ తీరును రికార్డు చేయనున్న శాస్త్రవేత్తలు
- మరో మూడు రోజులు కొనసాగనున్న అధ్యయనం

వివరాలు 7వ పేజీలో

ఘనంగా అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



భూపాలపల్లిలో జరిగిన ర్యాలీలో డీఎఫ్‌వో వసంత తదితరులు

కాకతీయఖని, సెప్టెంబరు 11: అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని భూపాలపల్లిలో బుధవారం ఘనంగా జరిగింది. ఫారెస్టు అధికారులు, సిబ్బంది ప్రగతిభవన్ నుంచి మంజూర్‌నగర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అటవీ శాఖ జిల్లా అధికారి వసంత మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. ఈ సందర్భంగా ఫారెస్టు కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ అక్షయ్, అటవీ శాఖ అధికారులు నరేష్, రూప్సీరాణి, ఇబ్రహీం, ప్రశాంత్, ఆనంద్, భాస్కర్, వైద్య సిబ్బంది శ్రీకాంత్, సౌజన్య, నవలోక, సంతోష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ములుగులో సంస్మరణ సభ

ములుగు కలెక్టరేట్: ములుగులోని జిల్లా అటవీశాఖ కార్యాలయంలో అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ అటవీశాఖ జిల్లా అధికారి రాహుల్ కిషన్‌జాదవ్ నివాళులు అర్పించారు. అనంతరం మోటార్‌సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన రహదారితోపాటు పలు వీధుల్లో ఈ ప్రదర్శన కొనసాగింది. అనంతరం ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించగా డీఎఫ్‌వో స్వయంగా పాల్గొని రక్తదానం చేశారు. పలువురు అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శంకర్‌తోపాటు అటవీశాఖ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ములుగు ఏరియా ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్

మావోయిస్టు దళ సభ్యురాలి లొంగుబాటు

వివరాలు 7వ పేజీలో...

మూడేళ్లయినా.. మోక్షమేదీ?

రామప్పకు నాలుగులైన్ల రోడ్డు.. ప్రతిపాదనలకే పరిమితం

ఇంకా పనులు ప్రారంభం కాకపోవడంపై సర్వత్రా అసంతృప్తి



నాలుగు లైన్ల ప్రతిపాదిత పాలంపేట-రామప్ప రహదారి

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 11 : యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి నాలుగులైన్ల రహదారికి మూడేళ్లయినా మోక్షం కలగడం లేదు. దీంతో అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి పనులు అడుగు ముందుకు పడటం లేదు. ఇప్పటికే ములుగు మండలం జంగాలపల్లి క్రాస్ నుంచి రామప్ప దేవాలయం ప్రధాన ఆర్చి వరకు రూ.60కోట్లతో నాలుగులైన్ల రహదారిని నిర్మించేందుకు రోడ్లు, భవనాల శాఖ అధికారులు 2022లో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ రహదారిపై 12కిలోమీటర్ల మేర సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సుమారు 150లైట్లు అమర్చడంతో పాటు సైడ్ డ్రెయినేజీ నిర్మించాలని ప్రతిపాదించారు. అయితే ఇది ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. ప్రతిపాదించి రెండేళ్లు పూర్తయినా ఇంకా పనులు ప్రారంభం కాకపోవడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఇరుకైన రోడ్ల ద్వారా రామప్పకు రావడానికి పర్యాటకులు పెద్దగా ఆసక్తి చూపడంలేదని తెలుస్తోంది. ఇరుకైన రహదారి వల్ల ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారిని మెరుగుపరిస్తే రామప్ప ఆలయానికి సందర్శకులు మరింత పెరిగే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కోటగుళ్లు, మైలారం గుహలు, పాండవులగుట్ట తదితర చారిత్రక ప్రదేశాలకు కూడా ఈ రహదారి మీదుగా రవాణా మెరుగుపడుతుందని స్థానికులు అంటున్నారు. నాలుగులైన్ల రహదారి నిర్మాణం కోసం నిధులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మునిసిపల్ ఆదాయాన్ని పెంచుకోవాలి

సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 11: మునిసిపల్ ఆదాయం పెంచడంపై ప్రత్యేక దృష్టిని సారించాల్సిన అసవరం ఉందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మునిసిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి అధ్యక్షత బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు అధికారులు ప్రాధాన్యమివ్వాలని అన్నారు. సీఎస్ఆర్ నిధులను పట్టణ అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. కార్మిక నివాస గృహాలకు మంచి నీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ జరిపి ప్రభావిత ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పిన సింగరేణి అధికారులు ఆ విషయాన్ని విస్మరించారని విమర్శించారు. మునిసిపల్ సర్వసభ్య సమావేశానికి సింగరేణి జీఎం ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. మునిసిపల్ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత కమిషనర్‌కు లేదా? అని అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఆ భూములను గుర్తించి కంచె ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో కుక్కలు, కోతుల బెడద తీర్చేందుకు గతంలోనే కౌన్సిల్ ఆమోదం తెలిపినా అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. స్వచ్ఛ వాహనాలకు ఇన్సూరెన్స్ ఎందుకు చేయించలేదని కమిషనర్ రాజేశ్వర్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. యువత డ్రగ్స్‌కు బానిస

మిగతా 8వ పేజీలో...

వీసీ నియామకమెన్నడో?

- కాళోజీ హెల్త్‌వర్సిటీకి వైస్ చాన్సలర్ భర్తీపై ఎడతెగని నిర్లక్ష్యం
- పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానించి.. మరిచిపోయిన వైద్యశాఖ
- 35 మంది నుంచి అందిన దరఖాస్తులు
- రెండు నెలలు గడిచినా పరిశీలించని కమిటీ
- మూడు పేర్లని సీఎంకు పంపే ప్రక్రియను మరిచిన వైనం
- నిబంధనలకు విరుద్ధంగా పదేళ్లుగా వీసీ బాధ్యతల్లో ఒకే వ్యక్తి
- గత ప్రభుత్వంతో ఉన్న సాన్నిహిత్యంతోనే కొనసాగింపని ప్రచారం
- పలు అవకతవకలకు వర్సిటీ నిలయంగా మారిందని ఆరోపణలు

వివరాలు 7లో..

కీలక పోస్టుల్లో రిటైర్డు ఉద్యోగులకు కీలక బాధ్యతలు అప్పగించడం.. పీజీ పరీక్షల ఫలితాల్లో అవకతవకలు.. వరంగల్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ అంచనా వ్యయం భారీగా పెంపు.. నర్సింగ్ కోర్సు నిర్వహణలో విఫలం.. తదితర ఆరోపణలు కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ కీర్తిప్రతిష్ఠలకు మాయని మచ్చల్లా మిగిలాయి. వీటంతటికీ పదేళ్లుగా ఒకే వ్యక్తి వీసీగా కొనసాగడమే కారణమని.. త్వరలోనే ఆ స్థానంలో కొత్త వ్యక్తిని నియమిస్తారన్న ప్రచారం జరిగింది. అందుకు అనుగుణంగా వైద్యశాఖ ఈ ఏడాది జూన్‌లో అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా 35మంది దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో ఇక కొత్త వీసీ వస్తారు.. వర్సిటీ పరిస్థితి మారుతుందని అంతా భావించారు. కానీ ఎడతెగని నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దరఖాస్తులు స్వీకరించి రెండు నెలలైనా వాటిని కమిటీ పరిశీలించకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తప్ప వీసీ నియామకం అంశంలో అడుగులు ముందుకు పడవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి, వరంగల్ ప్రతినిధి



కాళోజీ హెల్త్ యూనివర్సిటీ



18 నుంచి డీఎల్ఈడీ పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 11: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పరీక్షలు ఈ నెల 18 నుంచి 24 వరకు జరుగుతాయని డీఈవో డి.వాసంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. సంబంధిత వెబ్ పోర్టల్ నుంచి విద్యార్థులు వారి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను అనుమతించరని, పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని ఆమె పేర్కొన్నారు.

అడహక్ ప్రమోషన్‌లను క్రమబద్ధీకరించాలి

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 11: విద్యుత్ సంస్థల్లో టీవోవో- 954, ఎస్‌వోవో- 37 ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి ఇటీవల కల్పించిన అడహక్ ప్రమోషన్‌లను ఆర్‌టఆర్ (రూల్ ఆఫ్ రిజర్వేషన్) రూల్స్ ప్రకారం క్రమబద్ధీకరించాలని టీజీ ఎస్పీడీసీఎల్ ఎస్సీ, ఎస్టీ జాక్ నాయకుడు డీఈ ఆనందం డిమాండ్ చేశారు. పదోన్నతుల్లో పాతపద్ధతిని యథావిధిగా అమలు చేయాలని నిరసిస్తూ హనుమకొండ నక్కలగుట్టలోని కార్పొరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందం మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో టీవోవో- 954, ఎస్‌వోవో-35 ఉత్తర్వులు జారీ చేసి పదోన్నతుల్లో మెరిట్ కమ్ సీనియారిటీ అంశానికి తెరలేపి ఎస్సీ, ఎస్టీ పదోన్నతుల్లో రిజర్వేషన్‌లకు అడ్డంకులు సృష్టిస్తూ విద్యుత్‌శాఖలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ చర్య పూర్తిగా రాజ్యాంగానికి, రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన జీవోలకు వ్యతిరేకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ అసోసియేషన్ కంపెనీ ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, ఎస్టీ అసోయేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీరాంనాయక్, ఉద్యోగులు రమేశ్, ప్రభావతి, నర్సింహారావు, దుర్గం మల్లేశం, మొగిలయ్య, నందారాథోడ్, రమేశ్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

» ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు


పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

వరంగల్ జిల్లా, సెప్టెంబర్ 11: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. గురు, శుక్రవారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.


హైకోర్టు తీర్పు ఆధారంగానే కులగణన ప్రారంభించాలి

వడ్డెపల్లి, సెప్టెంబరు 11: హైకోర్టు తీర్పు ఆధారంగానే కులగణన ప్రారంభించాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ కోరారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ జవహర్ కాలనీలో నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించి రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణనపై రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, రాష్ట్ర, జిల్లా నాయకులు తమ్మల శోభారాణి, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్ పాల్గొన్నారు.


మండలి ప్రతిపక్ష నేతగా సిరికొండ

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 11: మండలి ప్రతిపక్ష నేతగా మాజీ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి నియమితులయ్యారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. జూలై 25న మండలిలో బీఆర్ఎస్ పక్షనేతగా మధుసూదనాచారిని ఆపార్టీ అధినేత కేసీఆర్ నియమించారు. ఆయనను ప్రతిపక్ష నేతగా గుర్తించాలని అసెంబ్లీ కార్యదర్శికి లేఖ అందజేయగా దానిపై బుధవారం ఆమోదముద్రపడింది.















వీసీ నియామకమెన్నడో?

కాళోజీ హెల్త్‌వర్సిటీకి వైస్ చాన్స్‌లర్ భర్తీపై ఎడతెగని నిర్లక్ష్యం

నిబంధనలకు విరుద్ధంగా పదేళ్లుగా వీసీ బాధ్యతల్లో ఒకే వ్యక్తి



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పోస్టు భర్తీపై ఎడతెగని నిర్లక్ష్యం ఆవహించింది. కొత్త వీసీ నియామకంపై వైద్యశాఖలో స్పష్టత కరువైంది. వర్సిటీ ఏర్పడిన నాటి నుంచి పదేళ్లుగా ఒకే ఒక వ్యక్తిని వీసీని కొనసాగిస్తుండగా.. కొత్త వీసీ కోసం దరఖాస్తులు స్వీకరించి రెండు నెలలైనా వాటిని పరిశీలన చేయకపోవడం పట్ల వైద్యశాఖ వర్గాల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుదీర్ఘకాలం పాటు వీసీగా పని చేయడంతో పాటు కీలక పోస్టుల్లో రిటైర్డు ఉద్యోగులకు కీలక బాధ్యతలు అప్పగింటచం, పీజీ పరీక్షల ఫలితాల్లో అవకతవకలు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ అంచనా వ్యయం భారీగా పెంపు, నర్సింగ్ కోర్సు నిర్వహణలో విఫలం తదితర ఆరోపణల నేపథ్యంలో వీసీని తొలగిస్తారనే ప్రచారం జరుగుతోంది. అయితే నోటిఫికేషన్ ఇచ్చి కొత్త వీసీని ఎంపిక చేయకపోవటం ఏంటనేది వైద్యశాఖలో చర్చనీయాంశంగా మారింది.

పదేళ్లుగా ఒకే ఒక్కవైస్‌చాన్సలర్

కాళోజీ హెల్త్ యూనివర్సిటీలో పదేళ్లుగా ఒకే ఒక్కరు వైస్ చాన్సలర్‌గా కొనసాగుతున్నారు. 2015 సెప్టెంబరు 26న హెల్త్ వైస్‌చాన్సలర్‌గా డాక్టర్ బి.కరుణాకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. 31 డిసెంబరు 2019నాటికి ఆయన పదవీకాలం ముగిసింది. అయితే యూనివర్సిటీ నిబంధనల ప్రకారం మరో ఆరు నెలల వరకు కొత్త వీసీ వచ్చేవరకు పదవిలో కొనసాగే అవకాశం ఉంది. ఆ గడువు కూడా ముగిసిపోయింది. సుమారు పది సంవత్సరాలుగా ఒక్కరే వీసీ సీటును వదలటం లేదనే విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వంలోని పెద్దల సహకారంలో సుదీర్ఘ కాలంగా వీసీ కుర్చిలో సెటిల్ అయ్యారనే ప్రచారం జరుగుతోంది. దేశ చరిత్రలోనే హెల్త్ యూనివర్సిటీకి ఒక్కరే వీసీగా ఇంతకాలం పని చేసిన దాఖలాలు ఎక్కడ లేవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో మార్చి 23న అన్ని యూనివర్సిటీలకు వీసీ పదవీకాలం పూర్తి కావటంతో ఐఏఎస్‌లను ఇన్‌చార్జ్ వీసీలుగా నియమించింది. అయితే పదేళ్లుగా వీసీగా బాధ్యతలు నిర్వహిస్తున్న కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీని మాత్రం టచ్ చేయకపోవటం వైద్య ఆరోగ్యశాఖలో చర్చనీయాంశంగా మారింది.

సెర్చ్ కమిటీ పరిశీలించేదెప్పుడో?

కాళోజీ హెల్త్ వర్సిటీ వైస్ చాన్సలర్ పదవీకాలం ఎప్పుడో పూర్తయింది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని పెద్దలతో సత్సంబంధాలు ఉండటంతో వీసీని మార్చకుండా కొనసాగించారనే ప్రచారం ఉంది. దీంతో పదేళ్లుగా హెల్త్ వర్సిటీ కుర్చీని వదలకుండా అతుక్కపోయారనే విమర్శలున్నాయి. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత యూనివర్సిటీల బలోపేతంపై దృష్టిపెట్టింది. అందులో భాగంగా తెలంగాణలో ఉన్న అన్ని యూనివర్సిటీలకు వీసీల నియామకం కోసం సెర్చ్ కమిటీలను నియమించింది. తాత్కాలికంగా ఐఏఎస్‌లను ఇన్‌చార్జ్ వీసీలుగా నియమించింది. అలాగే కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ నియామకం కోసం జూన్ 5వ తేదీ నుంచి 22వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానించింది. రెండేళ్ల పాటు డీన్‌గా లేదా కనీసం పదేళ్ల మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పని చేసి, 67ఏళ్ల లోపు వయస్సున్న వారు దరఖాస్తు చేసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ ఆహ్వానించింది. అయితే నోటిఫికేషన్‌లో డీన్‌గా రెండేళ్ల పాటు పని చేసి ఉండాలని సూచించటం యూజీసీ నిబంధనలకు విరుద్ధమని వైద్యులు వాదించటంతో తొలుత ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవరించి జూలై 6వ తేదీ వరకు దరఖాస్తులకు ఆహ్వానించారు. వరంగల్‌కు చెందిన పలువురు వైద్యులు కూడా వీసీ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే గడువులోపు 35కి పైగా దరఖాస్తులు వచ్చినట్టు సమాచారం. నిబంధనల ప్రకారం ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీ వీసీ పోస్టు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంటుంది. దరఖాస్తులు పరిశీలించిన తరువాత ముగ్గురి పేర్లను ప్రభుత్వానికి పంపించాలి. సెర్చ్ కమిటీ పంపిన మూడు పేర్లను సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించి తుది పేరును గవర్నర్ ఫైనల్ చేసి వీసీని నియమిస్తారు. అయితే జూలై 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి రెండు నెలలు గడిచినా ఇప్పటి వరకు సెర్చ్ కమిటీ వీసీ పోస్టుకు ముగ్గురి పేర్లను ఎంపిక చేసి ప్రభుత్వానికి పంపించకపోవడానికి కారణాలేంటనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది.

స్థానికత అంశంపై కోర్టులో కేసులు ఉండటంతో కొంత ఆలస్యమవుతోంది. వీటితో పాటు బీఎస్సీ నర్సింగ్ కోర్సులకు కూడా కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కొత్త వీసీ నియామకంపై వైద్యఆరోగ్యశాఖ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

కొత్త వీసీ కోసం వెయిటింగ్..

కాళోజీ హెల్త్ వర్సిటీలో పదేళ్లుగా ఒక్కరే వీసీగా బాధ్యతలు నిర్వహిస్తుండటంతో విశ్వవిద్యాలయం పాలన గాడి తప్పిందన్న విమర్శలున్నాయి. వీసీ యూనివర్సిటీలో కంటే హైదరాబాద్‌కే ఎక్కువ పరిమితం అవుతున్నారనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా గత ప్రభుత్వం వరంగల్ జైలు భూమి సర్వే నెంబరు 31,32లోని 2,75,759 గజాల స్థలాన్ని (56ఎకరాలు) తాకట్టు పెట్టి వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కోసం హైదరాబాద్‌లోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖ నుంచి రూ.1,173కోట్ల రుణం తీసుకుంది. ఈ విషయమై ఆగ్రహంగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించారు. అయితే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కోసం ఏర్పాటు చేసిన కమిటీలో వీసీ కూడా సభ్యుడిగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. జైలు స్థలం తాకట్టులో కమిటీ సభ్యులు, వైద్యులు, ఆర్‌అండ్‌బీ అధికారుల పాత్రపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. అలాగే 2022లో పీజీ సీట్ల కేటాయింపుల్లో గోల్‌మాల్ జరిగింది. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. అయితే రెండేళ్లుగా విజిలెన్స్ విచారణను ముందుకు సాగినివ్వటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రెగ్యులర్ ఉద్యోగుల నియామకంపై దృష్టిపెట్టకపోవటంతో పాటు తన సన్నిహితులను కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాల్లో నియమిం చుకున్నారనే ఆరోపణలను వీసీ ఎదుర్కొంటున్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు హెల్త్ యూనివర్సిటీని పునారవాస కేంద్రంగా మార్చారని, అంతేకాకుండా బీఎస్సీ నర్సింగ్ కోర్సును సక్రమంగా నిర్వహించటంలో వైఫల్యం చెందా రన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో మగవారికి కూడా అవకాశం కల్పించాలని 2007లోనే ప్రభుత్వం ఆదేశించింది.

ప్రస్తుతం ఆడవారికి మాత్రమే నర్సింగ్‌లో అడ్మిషన్లు ఉండగా, మగవారు కూడా నర్సింగ్ కోర్సుపై ఆసక్తితో ఉన్నారు. దీనిపై పలువురు కోర్టుకు వెళ్లినప్పటికి మగవారికి హాస్టల్ వసతి లేదనే సాకుతో ఇన్నాళ్లు ప్రవేశాలు కల్పించటం లేదు. కనీసం డే స్కాలర్‌గానైనా అవకాశమివ్వాలని మగవారు కోరుతున్నా హెల్త్‌వర్సిటీ పట్టించుకోవటం లేదు. దీనికి వీసీ నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలున్నాయి. బీఎస్సీ నర్సింగ్ కోర్సులో గతేడాది అడ్మిషన్ల విషయంలో గందర గోళంగా వ్యవహరించారని, ఈఏడాది కూడా నర్సింగ్ అడ్మిషన్లపై స్పష్టత ఇవ్వటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తానికి పదేళ్లుగా అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న పాత వీసీని మార్చి కొత్త వీసీని ఎప్పుడు నియమిస్తారనే చర్చ వైద్య ఆరోగ్య శాఖలో జోరుగా జరుగుతున్నా ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుందా అని ఎదురుచూస్తున్నారు.



బ్యారేజీలో బోట్‌పై ఏడీసీపీ సర్వే నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు

మేడిగడ్డ బ్యారేజీలో ఏడీసీపీ సర్వే

- ప్రవాహ తీరును రికార్డు చేయునున్న శాస్త్రవేత్తలు
- మరో మూడు రోజులు కొనసాగనున్న అధ్యయనం

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 11 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీలో నీటి ప్రవాహ వేగాన్ని తెలుసుకునేందుకు అకాస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫైలర్ (ఏడీసీపీ) సర్వే బుధవారం నిర్వహించారు. పూణేకు చెందిన సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్లూపీఆర్ఎస్) శాస్త్రవేత్త సంపత్ కుమార్ నేతృత్వంలోని నలుగురు బృందం సభ్యులు పవర్ బోట్‌లో తిరుగుతూ పరిశీలించారు. బ్యారేజీకి ఎగువ, దిగువ ప్రవాహ బ్లాకుల్లో ప్రవాహ తీవ్రతను అధ్యయనం చేశారు. ఇది ఇంకా రెండు, మూడు రోజులుగా కొనసాగనుంది. గోదావరిలో ప్రవాహ తీవ్రత ఎక్కడ ఏవిధంగా ఉందో శాస్త్రవేత్తలు గుర్తించనున్నారు.దీన్ని బట్టి ప్రవాహ తీవ్రతకు బ్యారేజీ సామర్థ్యం సరిపోతుందా.. లేదా? అనేది నిర్ధారణకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. రెండు వారాల క్రితమే ఈసర్వే నిర్వహించాల్సి ఉండగా పవర్ బోట్ అందుబాటులో లేకపోవడంతో ఆలస్యమైనట్లు సమాచారం. నాటు పడవలు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రవాహ తీవ్రత ఎక్కువగా ఉండటంతో సర్వేను వాయిదా వేశారు. పవర్ బోట్ అందుబాటులోకి రావడంతో సర్వేను బుధవారం ప్రారంభించారు. సీడబ్ల్యూపీఆర్ఎస్ శాస్త్రవేత్తల వెంట ఈఈ తిరుపతి రావు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

- మార్కెటింగ్ శాఖ జేడీ ఉప్పుల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ ఉప్పుల శ్రీనివాస్

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 11: మార్కెట్ ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వహించవద్దని మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీల కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మరికొద్ది రోజుల్లో కాటన్ సీజన్ ప్రారంభం కాబోతున్నందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. యార్డులలో మౌలిక సదుపాయలు కల్పించి తాగు నీరు, లైటింగ్, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేయింగ్ మిషన్స్ సరి చేయించుకోవాలని, ఖరీదుదారుల నుంచి ప్రతీ నెల కొనుగోలు నివేదికలు తీసుకుంటూ మార్కెట్ ఫీజు ఎప్పటికప్పుడు వసూలు చేయాలని ఆదేశించారు. మార్కెట్లను ఆకస్మిక తనిఖీలు చేసినప్పుడు ఏదైనా తేడా వస్తే దానికి మీరే బాధ్యత వహించాల్సి వస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో సురేఖ, ఏనుమాముల మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మల, ఉమ్మడివరంగల్ జిల్లాలోని వ్యవసాయ మార్కెట్‌ల కార్యదర్శులు పాల్గొన్నారు.

'గోమయం' గణపయ్య..

- ఆవుపేడ, గోపంచకం, పసుపుతో విగ్రహం
- నవరాత్రుల్లో ఎనిమిదేళ్లుగా ఇదే ప్రత్యేకత



గోమయం వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న శ్రీమహాలక్ష్మీగణపతి సేవా ట్రస్టు బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 11: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీమహాలక్ష్మీ గణపతి సేవాట్రస్టు ఆధ్వర్యంలో తొలుత మట్టివిగ్రహాలను పూజించారు. ఆ తర్వాత మరో అడుగు ముందుకేసి.. ఎనిమిదేళ్లుగా 'గోమయం' వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ఎస్వీ. నాగేశ్వర్‌రావు, సోమ శ్రీనివాస్, శ్రీరంగం రామారావు, సోమ రాంబాబు ఆధ్వర్యంలో 2000 సంవత్సరంలో శ్రీమహాలక్ష్మీ గణపతి సేవా ట్రస్టును స్థాపించారు. పర్యావరణ పరిరక్షణే నినాదంగా ఈ ట్రస్టు వారు గోమయం (ఆవుపేడ), గోపంచకం, చింతగింజల పొడి, వేపాకు పేస్టు, పసుపుతో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో తయారు చేసిన గోమయం విగ్రహాన్ని కొనుగోలు చేసి తీసుకొచ్చి మహబూబాబాద్‌లో ప్రతిష్ఠించి నవరాత్రులు పూజలు చేస్తున్నారు. ఈ గోమయం విగ్రహం ద్వారా పర్యావరణానికి మేలుజరుగుతుందని, చెరువులో నిమజ్జనం చేశాక త్వరితగతిన కరిగిపోవడంతో పాటు ఆవుపేడ, గోపంచకం, వేపాకు పేస్ట్, పసుపు, చింతగింజల పొడి నీటిలో కలిసి క్రిమికీటాకాలు నశించిపోతాయని పర్యావరణ నిపుణులు, ప్రేమికులు చెబుతున్నారు. అంతేకాదు ఈ వినాయక విగ్రహం వద్ద నిత్యం కాళేశ్వరం నుంచి ప్రత్యేకంగా తీసుకవచ్చిన గంగాజలంతో పాటు 21రకాల అభిషేకాలు నిర్వహిస్తున్నారు.



బీసీ కాలనీలోని రోడ్డు వద్ద మార్కింగ్ చేస్తున్న అధికారులు

తేలుతున్న కబ్జాల లెక్క

- రెండో రోజు జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ భూ సర్వే
- కూల్చివేతలకు సిద్ధమవుతున్న అధికారులు
- వర్సిటీ భూ కబ్జాదారుల గుండెల్లో రైళ్లు

పకడ్బందీగా కేయూ భూముల సర్వే

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 11: కాకతీయ యూనివర్సిటీ భూ కబ్జాలు, అక్రమణలపై రోజు రోజుకూ కొత్త విషయాలు బహిర్గతమవుతాయి. రెండు రోజులుగా వర్సిటీలోని భూ కబ్జాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు బృందం నేతృత్వంలో పకడ్బందీగా సర్వేలకు దిగారు. ఈ సర్వేతో గతంలో వర్సిటీ అధికారులు చేసిన డిజిటల్ సర్వే, గూగుల్ మ్యాపులను మిం చి అధికంగా వర్సిటీ భూములు కబ్జాలకు గురైనట్లు తాజాగా చేపట్టిన సర్వేలతో రూఢీ అవుతోంది. దీంతో కబ్జాదారుల గుండెల్లో రైళ్ల పరుగెడుతున్నాయి. ఇన్ని రోజులు వర్సిటీ భూమిని దర్జాగా అనుభవిస్తున్న కబ్జాదారులు.. ఇప్పటి తాజా సర్వేలతో బెంబేలెత్తుతున్నారు.

బీసీ కాలనీలో..

వర్సిటీ క్యాంపస్‌లోని న్యూ పీజీ బాయ్స్ హాస్టల్ పక్కన 229 సర్వేనెంబర్‌లో బుధవారం అధికారుల బృందం సర్వే నిర్వహించారు. ఇందులో బీసీకాలనీలో 30మంది ఇళ్ల వర్సిటీకి చెందిన భూమిల్లోకి వచ్చినట్లు స్పష్టత వస్తోంది. వర్సిటీ భూములను గుర్తించి ఇళ్లకు మార్కింగ్ చేసి కూల్చివేతలకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ సన్నద్ధం అవుతోంది. తాజా సర్వేతో బీసీ కాలనీలోని అంతర్గత రోడ్డుతో పాటు డెడ్ ఎండ్ సైతం వర్సిటీ భూమిలోనే ఉందని స్పష్టతరాగా, వెంటనే అధికారులు ఆయా స్థలాల్లో అధికారులు మార్కింగ్ చేశారు. అలాగే బీసీకాలనీలోని రోడ్డు సైతం వర్సిటీ భూమిలో ఉండటంతో ఏంచేయాలనే ఆలోచనలో పడ్డారు. సర్వే అనంతరం హనుమకొండ రెవెన్యూ సర్వేయర్ రాజేశ్ నేతృత్వంలో మార్కింగ్ చేసి భూ పంచనామా చేశారు. తర్వాత కూల్చి వేతలకు చేపడుతామని అధికారులు చెబుతున్నారు. శుక్రవారం నుంచి 214లో సర్వే నెంబర్‌లో సర్వే చేపట్టనున్నారు. అంతకుముందే అయా స్థలాల్లో కబ్జాలు, అక్రమణలకు పాల్పడ్డ వారికి నోటీసులు జారీ చేస్తామని మనిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు. వీటితోపాటు వర్సిటీలో ని మరో 6 సర్వే నెంబర్లలోనూ భూసర్వే చేపట్టిన తర్వాత వర్సిటీ భూమిపై పూర్తి స్పష్టత వస్తుందని జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ భావిస్తోంది.

వర్సిటీ మాజీలకు బిగుస్తున్న ఇచ్చు

కాకతీయ యూనివర్సిటీలో తాజా పరిణామాలను గమనిస్తే వర్సిటీ తాజా మాజీల చుట్టూ ఉచ్చు బిగుస్తోందని తెలుస్తోంది. అప్పటి బీఆర్ఎస్ అధికార పార్టీ ఎమ్మెల్సీ, ఇప్పటి ఎమ్మెల్యే ప్రోద్బలంతో తాజా మాజీలు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. తామేమి చేసినా ఏం కాదనే అహంకారంతో వ్యవహరించారనే చర్చ సాగుతోంది. అలాగే వర్సిటీ అధ్యాపకుల సంఘం (అకూట్) జనరల్ సెక్రెటరీ డాక్టర్ మామిడాల ఇస్తారీ, ఇతర విద్యార్థి సంఘాల నేతలు వర్సిటీలో జరిగిన అవినీతి అక్రమణలు, అధికార దుర్వినియోగంపై స్పష్టమైన ఆధారాలతో రాష్ట్రప్రభుత్వానికి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అవినీతి ఆరోపణలతోపాటు ఇతర విషయాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను విచారణకు ఆదేశించారు. దీంతో తాజా మాజీ వీసీపై వచ్చిన భూ కబ్జాలు, కేయూలో పీహెచ్‌డీ అడ్మిషన్లు అక్రమాలు, అడ్జంట్ ప్రొఫెసర్ల నియామకాలు, న్యాక్ అభివృద్ధి పనుల పేరుతో అందినకాడిన దోచుకున్న తీరు, తెలుగు తది తర విభాగాల్లో అక్రమంగా పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాలు, తనకు అనుకూలమైన డీన్లు, ఇతర ఏ ఆర్‌లను ప్రధాన విభాగాల్లో నియమించుకుని డబ్బుల వసూళ్లకు పాల్పడిన తీరుపై విజిలెన్స్ డేగకన్నును వే సింది. వర్సిటీలోని ఆడిట్ కార్యాలయంలోని అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఏసీబీ అధికారులు హాస్టల్ కాంట్రాక్టర్ వద్ద నుంచి డబ్బుల వసూళ్లకు పాల్పడగా పట్టుకున్నారు. అప్పట్లో ఈ విషయంలో వర్సిటీతోపాటు రాష్ట్ర వ్యాప్తం గా సంచలనంగా మారింది.

వీటన్నింటితోపాటు ఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కబ్జాల స్థలంలో ఇల్లు నిర్మించుకోవడమే కాకుండా, అత్యున్నత పాలక మండలి నేతృత్వం వహించిన భూకమిటీలోనూ పనిచేసి తన ప్రాబల్యాన్ని చూపించారనే ఫిర్యాదులున్నాయి. వీటన్నింటినీ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ అనిల్‌కుమార్, ఎస్సై రాజేశ్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు. వర్సిటీ నిబంధనలు ఏమి చెబుతున్నాయి..? రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు ఎలా ఉన్నాయి..? వర్సిటీలో ఏమి జరిగింది? ఏ పనులు నిబంధనలకు విరుద్ధంగా చేశారనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అడ్జంట్ ప్రొఫెసర్ల నియామకాలపై వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటికే విజిలెన్స్ అధికారులకు అడ్జంట్ ఫ్యాకల్టీగా పనిచేసిన ప్రొఫెసర్లంతా ప్రత్యేకంగా విజిలెన్స్ అధికారులను కలిసి తమ వాదనలతో కూడిన అఫిడవిట్లు సమర్పించారు.

ఒక్కొక్క ఆరోపణలు రోజు రోజుకూ నిజ మని రూఢీ అవుతుండంగా, వర్సిటీలోని అక్రమాలకు బాధ్యులైన మాజీ బాస్‌లకు ఉచ్చు బిగుస్తోందనే విషయం బహిరంగ చర్చకు దారి తీస్తోంది. వర్సిటీ భూ కబ్జాలతో పాటు ఇతర అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగం తదితర వివాదాస్పద అంశాలన్నీ తాజాగా వర్సిటీలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

నెహ్రూసెంటర్ (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 11 : మహబూబాబాద్ మెడికల్ కళాశాలలో ఖాళీగాఉన్న కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఆధ్యాపక పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లకావత్ వెంకట్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న ప్రభుత్వ వైద్య కళాశాలలో వాక్‌ఇన్ ఇంటర్యూ పద్ధతిన పోస్టులను భర్తీ చేస్తారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ 5 పోస్టులు, అసోసియేట్ ప్రొఫెసర్ 7, అసిస్టెంట్ ప్రొఫెసర్ 19, సీనియర్ రెసిడెన్స్ 49, ట్యూటర్ 26 పోస్టులు ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత అర్హత సర్టిఫికెట్లు, కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, జిరాక్స్, ఒరిజినల్స్ తీసుకుని ప్రభుత్వ వైద్య కళాశాల మహబూబాబాద్‌కు హాజరు కావాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 69 ఏళ్ల కలిగి ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాల వెబ్‌సైట్ http://gmcmahabubabad.org. నోటిఫికేషన్ దరఖాస్తులు పొందవచ్చని తెలిపారు

వరంగల్ జిల్లా కోర్టు గవర్నమెంట్ ప్లీడర్‌గా రవి



వరంగల్ లీగల్, సెప్టెంబరు 11: వరంగల్ జిల్లా ప్రధాన కోర్టు ప్రభుత్వ న్యాయవాది (గవర్నమెంట్ ప్లీడర్)గా న్యాయవాది పోతరాజు రవిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పదవిలో ఆయన ఆరు నెలల పాటు కొనసాగుతారని ఉత్తర్వులో పేర్కొన్నారు. 20 ఏళ్ల నుంచి జిల్లాకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్టు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 11: ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మండిబజార్ వద్ద పోలీసులు గంజాయిని పట్టుకున్నారు. సీఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం శాయంపేటకు చెందిన షేక్ రషీదా మండిబజార్ వద్ద బిక్షాటన చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. బిక్షాటనతో కుటుంబ అవసరాలు తీరడంలేదని.. సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించింది. బల్లార్షా వెళ్లి అరకిలో గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చింది. చిన్న చిన్న ప్యాకెట్లు చేసి మండిబజార్ ప్రాంతంలో విక్రయిస్తోంది. బుధవారం పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు రషీదా అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని చూడగా గంజాయి లభించింది. నిందితురాలి నుంచి 250 గ్రాముల గంజాయి, రూ.3వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్టు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ శివకుమార్ తెలిపారు. గంజాయి విక్రయించిన వారిపై సేవించిన వారిపై కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

- మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న మాల మహానాడు, అంబేద్కర్ సంఘం నేతలు

వడ్డేపల్లి, సెప్టెంబరు 11: ఎస్సీ, ఎస్టీ కులాల వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీఎస్పీ, అంబేద్కర్ సంఘం, ఆర్‌పీఐ, సమాజ్‌వాది పార్టీ, లోక్‌జనశక్తి, సమత సైనిక్‌దళ్‌తో పాటు గిరిజన పార్లమెంటు సభ్యులు చేస్తున్న దర్నాకు సంఘీభావంగా బుధవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు, అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేశారు.

ఈ సందర్భంగా మన్నె బాబురావు, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామితో పాటు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దావ రవి, జిల్లా ఉపాధ్యక్షుడు పనికెల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ కులాలను వర్గీ కరణ చేసేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 341ని పరిగణలోకి తీసుకోకుండా ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఎస్సీ, ఎస్టీల మధ్య విబేధాలు సృష్టించేదిగా ఉందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అంశాన్ని పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో మాల మహానాడు, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర, జిల్లా నేతలు బండి అశోక్, సింగారపు రవిప్రసాద్, బొల్లం రాం కుమార్, ఉసిల్ల ఉదయ్, గొర్రె రమేష్, సాదు కుమార స్వామి, దండ్ర శ్రీనివాస్, కొరివి అనిల్, మల్లం రాజ్‌కుమార్, నర్సయ్య, సురాసి విక్రమ్, పరశురాములు, పోతురాజు ప్రభాకర్, రామన్న, జగపతి, హరీష్, కూనమల్ల రవి, దండు రవి పాల్గొన్నారు.

మడికొండ క్వాడ్రంట్ కంపెనీలో వాక్ ఇన్ డ్రైవ్

- ఐటీలో యువతకు ఉపాధి అవకాశాలు

మడికొండ, సెప్టెంబరు 11: మడికొండ ఐటీ సెజ్‌లోని క్వాడ్రంట్ ఐటీ కంపెనీలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా వాక్ ఇన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు క్వాడ్రంట్ డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022, 22, 23, 24 సంవత్సరాల్లో ఎంబీఏ, బీబీఏ, బీటెక్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈనెల 13న క్వాడ్రంట్ కంపెనీలో జరిగే వాక్ ఇన్ డ్రైవ్‌లో ఉపాధి అవకాశాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇన్సైడ్ సేల్స్, ప్రీ సేల్స్, ప్రొడక్ట్ ఆఫ్ టెక్నాలజీ సేల్స్ అవకాశాలు ఉన్నాయన్నారు. డే షిఫ్ట్‌లో వర్క్ ఉంటుందన్నారు. గుడ్ కమ్యూనికేషన్ స్కిల్స్, మార్కెటింగ్, కోల్డ్ కాలింగ్, సేల్స్ ప్రాసెస్ నాలెడ్జి, దృఢమైన లీడర్‌షిప్ స్కిల్స్ ఉన్నవారికి అవకాశాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఆసక్తి గల యువత శుక్రవారం ఉదయం 10.30 గంటలకు క్వాడ్రంట్ ఐటీ సెజ్‌లో నిర్వహించే వాక్ ఇన్ డ్రైవ్‌కు హాజరుకావాలని మురళీధర్ రెడ్డి కోరారు.

మావోయిస్టు దళ సభ్యురాలి లొంగుబాటు



మావోయిస్టు లొంగుబాటును చూపుతున్న ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు11: మావోయిస్టు పార్టీ దళ సభ్యురాలు ములుగు జిల్లా ఏటూరునాగారం పోలీసులు ఎదుట బుధవారం రాత్రి లొంగిపోయింది. ఏటూరు నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ విలేకరుల సమావేశంలో ఈ మేరకు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం పూజారి కాంకేర్ ఏరియా దళ సభ్యురాలు (ఏసీఎం) పోడియం సోమిడి అలియాస్ రోని మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు నచ్చక పార్టీ నుంచి బయటకు వచ్చి లొంగిపోయిందని తెలిపారు. పూజారి కాంకేర్ ఆర్‌పీసీ కమాండర్ కుర్సం సమ్మయ్య అలి యాస్ సమ్మన్న ప్రోద్బలంతో సోమిడి 2019లో మావోయిస్టు పార్టీ మిలీషియా సభ్యురాలిగా చేరిందన్నారు. ఆ తర్వాత ఆయన దగ్గర ఆరు నెలలు పనిచేసిందని, అనంతరం రెండో సెంట్రల్ రీజినల్ కమాండర్ దొడ్డి పోజ్జ అలియాస్ ప్రకాశ్ ఆమెకు పార్టీ సభ్యురాలిగా పదోన్నతి కల్పించాడని వివరిం చారు. అక్కడ ఆమె దళకమాండర్ సాగర్‌కు గార్డుగా యేడాది పాటు పనిచేసిందని, ఆ తర్వాత సెంట్రల్ రీజినల్ ఒకటో ప్లాటూన్‌లో చేరిందని వివరించారు. 2023లో ఆమె ఏరియా కమిటీ సభ్యురాలుగా హోదా పొందిందన్నారు. సోమిడిపై రూ.4 లక్షల రివార్డ్ ఉందని ఏఎస్పీ తెలిపారు. ఆయా హోదాల్లో పనిచేసి నపుడు పలు హింసాత్మక సంఘట నలు సహా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కర్రె గుట్టల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆమె పాల్గొందని తెలిపారు. ఆ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారని అన్నారు. అదేవిధంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జగురగొండ పీఎస్ పరిధిలోని కుందేర్ గ్రామంలో ముగ్గురు సీఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లను కాల్చి చంపిన సంఘటనలో సోమిడి పాల్గొందని ఏఎస్పీ తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ధర్మారం క్యాంపుపై జరిగిన దాడిలో ఆమె పాల్గొంద న్నారు. అదే రాష్ట్రం పెద్దబట్టంలోని కవుర గుట్టలో జరిగిన పోలీసుల కాల్పుల్లో తప్పించుకుందని వివరించారు. మావోయిస్టు పార్టీ భావజాలంపై విరక్తితో సోమిడి బయటకు వచ్చిందన్నారు.

మావోయిస్టులు ప్రజల వద్ద డబ్బులు వసూలు చేసి ముఖ్య నేతలకు పంచే విధానం నచ్చక ఆమె పార్టీని వీడి జన జీవన స్రవంతి కలుస్తోందని ఏఎస్పీ తెలిపారు.

నేడు మంత్రి సీతక్క పర్యటన

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

ములుగు, సెప్టెంబరు 11: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క గురువారం ములుగు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ములు గు, గోవిందరావుపేట మండలాల్లో పలు అభివృద్ధి పనుల కు ప్రారంభోత్సవాలు చేస్తారు. బుధవారం రాత్రి హైద రాబాద్ నుంచి బయలుదేరి జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. ఉదయం 9గంటలకు ములుగు మండలం మల్లంపల్లిలో మిల్క్ పార్లర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం శివతండా-రాంసింగ్ తండాల మధ్య నిర్మించిన బీటీ రోడ్డు, శివతండా-నౌశ్యాతండాల మధ్య నిర్మించిన బీటీ రోడ్లను ప్రారంభిస్తారు. జాకారంలో పాల శీతలీకరణ కేంద్రాన్ని, పులిగుండం నుంచి చింకుంట మీదుగా జగ్గన్నపేట వరకు నిర్మించిన బీటీ రోడ్లను ప్రారంభిస్తారు. ఆతర్వాత గోవిందరావుపేట మండలంలోని జాతీయ రహదారి నుంచి ఫ్రూట్‌ఫారం వరకు నిర్మించిన బీటీ రోడ్డు, పస్రాలోని ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి నేతాజీనగర్ వరకు నిర్మించిన బీటీ రోడ్లను మంత్రి ప్రారం భిస్తారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఘనంగా గణపతి హోమం



గణపతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మహదేవపూర్, సెప్టెంబరు 11: శ్రీ వినాయక నవరాత్రుల్లో భాగంగా శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తి ఆధ్వర్యంలోగణపతి హోమం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు బుధవారం జరిగాయి. అనంతరం దేవస్థానం ప్రసాదశాలలో వినాయక నవరాత్రులను పురస్కరించుకుని ప్రత్యేక అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. కార్య నిర్వహణాధికారి ఎ.మారుతి, సూపరిం టెండెంట్ బుర్రి శ్రీనివాస్, మాజీ ధర్మకర్తలు, ప్రజాప్రతి నిధులు, కాళేశ్వరం గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర రహదారిలో రాకపోకలు యధాతథం

వాజేడు, సెప్టెంబరు 11: జాతీయ రహదారి టేకులగూ డెం వద్ద ఉన్న రేగుమాగు గండికి బుధవారం వరద ప్రవా హం తగ్గింది. దీంతో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్‌కు రాకపోకలు యధాతథంగా కొనసా గుతున్నాయి. రెండు రోజులుగా గోదావరికి వరద నీరు పెరగ టంతో రాకపో కలకు అంతరా యం ఏర్పడగా పోలీసులు బారికే డ్లను ఏర్పాటు చేశారు. వరద ప్రవాహం తగ్గడంతో పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్ర సాద్ వాహనాలను దగ్గరుండి పంపించి వేశారు.

గణేష్ మండపాల వద్ద అన్నదానాలు

కాటారం, సెప్టెంబరు 11: మండలంలోని పలు గ్రామా ల్లో బుధవారం గణపతి మండపాల వద్ద అన్నదాన కార్యక్ర మాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆదర్శ నగర్, ఎర్రగుంటపల్లి, కాపువాడ, లక్ష్మీదేవర ఆలయం, గొల్లపల్లి, గారెపల్లి గ్రామాల్లో ఇవి జరిగాయి. కడారి రాజయ్య-సు భద్ర, గోనే రమాదేవి-శ్రీనివాస్, గద్దె సాగర్-ప్రత్యూష, మధూకర్ రెడ్డి దంపతులు అన్నదానం చేపట్టారు.

'మేడిగడ్డ'కు 3.62 లక్షల క్యూసెక్కులు

మహదేవపూర్ రూరల్, సెప్టంబరు 11 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బుధవారం బ్యారేజీలోకి 3.62 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుం డగా 85 గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద 4.90 మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది.

అటవీ అమరవీరుల యాదిలో..



వెంకటాపురంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ర్యాలీ

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబరు 11: మండల కేంద్రంలోని ఫారెస్టు డివిజన్ కార్యా లయంలో బుధవారం అటవీ శాఖ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా జరిగింది. వెంకటాపురం, వాజేడు మండలాల అటవీశాఖ అధికారులు, సిబ్బంది మండల కేంద్రంలోని ప్రధాన రహదారితోపాటు పలు వీధుల్లో మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. అటవీశాఖ అధికారి చంద్రమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.

● మంగపేట: మండలంలో అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిం చారు. బ్రాహ్మణపల్లి ఫారెస్ట్ చెక్‌పోస్ట్ నుంచి కమలాపురం వరకు బైక్ ర్యాలీ జరిగింది. రేంజ్ ఆఫీసర్ షకీల్ పాషా, ఎఫ్ఎస్‌వోలు, బీట్ ఆఫీసర్లు, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

● ఏటూరునాగారం: అటవీ శాఖ అమరులవీరుల సంస్మరణ దినోత్సవం సంద ర్భంగా ఫారెస్టు కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎఫ్‌డీవో రమేష్, సౌత్ రేంజ్ అధికారి అబ్దుల్ రహ్మాన్, వన్యప్రాణి డివిజన్ పరిధిలోని పస్రా, వెంకటాపురం, మంగపేట రేంజ్‌లు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు. బ్లడ్ డోనర్స్ ప్రతనిధి సయ్యద్ వహీద్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

భూపాలపల్లి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా వెంకటేశం

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబర్ 11: భూపాలపల్లి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా టి. వెంకటేశం నియమితుల య్యారు. ఈమేరకు రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ బుధ వారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆటో డ్రైవర్లు ఖాకీ చొక్కా ధరించాలి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెం బరు 11: ఆటో డ్రైవర్లంతా తప్పక ఖాకీ చొక్కా ధరించాలని భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ సూచించారు. బుధవారం భూపాలపల్లి జిల్లా కేం ద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఆటో డ్రైవర్లకు మోటారు వాహన చట్టాలపై, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆటో డ్రైవ ర్లు లైసెన్సు, అన్ని రకాల పత్రాలు ఉండాలన్నారు. ఈ కార్యక్ర మంలో ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మానుకోట జిల్లాలో కేంద్ర బృందం పర్యటన



సీతారాంతండాలో వరద బాధితులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

మరిపెడ (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 11: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో కేంద్రబృందాలు పర్యటించాయి. పదిరోజుల కిందట భారీ వర్షాలకు వరదముంపునకు గురై నష్టపోయిన పంటపొలాలను, జలదిగ్బంధానికి గురైన ఇళ్లను, తెగినరోడ్లను, కుంటలు, చెరువులను ఆరుగురు సభ్యులు ఉన్న కేంద్రబృందం రెండుగా విడిపోయి క్షుణ్ణంగా బుధవారం రాత్రి పరిశీలించారు. తొలుత మరిపెడ మండలం ఉల్లేపల్లిలో జలదిగ్బంధానికి గురైన ఇళ్ల బాధితుల వద్దకు వెళ్లి వారికి జరిగిన నష్టాన్ని పరిశీలిస్తూ, బాధితులు చెప్పిన అన్ని విష యాలను వింటూ సహాయక చర్యలపై కేంద్రబృందం ఆరా తీసింది. అనంతరం ఉల్లేపల్లిలో వరద ఉధృతి, జరిగిన నష్టంపై అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. సీతారాంతండాలో కేంద్ర బృందం పర్యటించగా అక్కడ జలదిగ్బంధానికి గురైన ఇళ్లను చూసి అవాక్కయ్యారు. మరో కేంద్ర బృందం అబ్బాయిపాలెం, గాలివారి గూడెం, పురుషోత్తమయగూడెం రోడ్డు డ్యామేజ్‌లను పరిశీలించారు. వీరికి అర్అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయ తీరాజ్ ఇంజనీర్లు నష్ట అంచనాలను వివరించారు. కేంద్ర తనిఖీ బృం దంలో కల్నల్ కెపి.సింగ్, మహేష్ కుమార్, శాంతినాథ్ శివప్ప కాగి, ఎస్‌కె కుష్వాహ, టి.నిలయకన్నన్, డాక్టర్ శశివర్ధన్, రాష్ట్ర డిజాస్టర్ మేనే జ్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్‌కుమార్, ఆర్‌అం డ్‌బీ సీఈ నాగేందర్‌రావు, సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అడిషనల్ కలెక్టర్ డేవిడ్, తొర్రూరు ఆర్డీవో నరసింహారావు, తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో విజయ, అర్అండ్‌బీ, పంచాయతీ రాజ్, ఇరి గేషన్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ముల్కలపల్లిలో..

డోర్నకల్: డోర్నకల్ మండలం ముల్కలపల్లిలో బుధవారం రాత్రి కేంద్రబృందం దెబ్బతిన్న ప్రాంతా లను పరిశీలించారు. ముల్కలపల్లిలోని ఎస్సీ కాలనీని సందర్శించి బాధితులతో మాట్లాడారు. అనంతరం వర దకు కొట్టుకుపోయిన హైలెవల్ వంతెనను పరిశీలిం చారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. జరిగిన నష్టాన్ని నివేదిక రూపంలో కేంద్రప్రభుత్వానికి అంది స్తామని వారు తెలిపారు.

మునిసిపల్ ఆదాయాన్ని పెంచుకోవాలి

(5వ పేజీ తరువాయి)

అవుతున్నారని, వాటిని అరికట్టేందుకు ఎక్సైజ్, పోలీసు అధికారులు ఏం చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. సమావేశానికి ఎక్సైజ్ శాఖ అధికారి హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిమితికి మించి ఇసుక లోడ్ వెళ్తున్న లారీపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. రాజ్యాంగం 73,74 సవరణల ప్రకారం పట్టణంలోని ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. దేవాలయాల పరిసరాల్లో మద్యం, మాంసం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్ ఎదురుగా ఉన్న జర్నలిస్టుల ప్లాట్ల వద్ద వెంటనే విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూపాలపల్లి పట్టణ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 11: భూపా లపల్లి పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారా యణరావు అన్నారు. పట్టణంలోని పరిధిలోని కుందూరు పల్లి, భాస్కరగడ్డలో రూ. కోటి టీయూఎఫ్‌డీసీ నిధులతో చేపడుతున్న సైడ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఆయన బుధ వారం శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ పట్టణ వాసుల దాహార్తి తీర్చేందుకు అమృత్ పథకం 2.0 ద్వార రూ. 18.99 కోట్లతో ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాం కుల నిర్మాణం చేశామన్నారు. రోజు రోజుకూ పట్టణం విస్తరిస్తోందని, ఈ నేపథ్యంలో ప్రజలకు మంచి నీటి కష్టాలు తలెత్తుతాయని, దానిని దృష్టిలో ఉంచుకుని అవి తీర్చేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. సీసీ రోడ్డు పనులు చేసే కాంట్రాక్టరు నాణ్యతతో, త్వరతగతిన పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, కౌన్సిల ర్లు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే

భూపాలపల్లి పట్టణంలోని వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన గణపతి మండపాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సందర్శిం చారు. ఆయా కమిటీలు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన్నన కమిటీ సభ్యులు సన్మానించారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

మంగపేట, సెప్టెంబరు 11: ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కమలాపురంలోని గోదావరి ఒడ్డుకాలనీకి చెందిన నున్న నాగేశ్వర్‌రావు, కస్తూరి(28) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త సెంట్రింగ్ పనికి వెళ్లగా పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో కస్తూరి తన అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. అక్కడే నిద్రకు ఉపక్రమించింది. ఈ క్రమంలో వరండాలోకి దూలానికి ఆమె చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. లోపలి నుంచి వచ్చి ఈ దృశ్యాన్ని చూసిన అమ్మమ్మ కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి చూడగా విగతజీవిగా కస్తూరి వేలాడుతూ కనిపించింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న ఎస్సై సూరి ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కస్తూరి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి : సీపీఐ

కాకతీయఖని, సెప్టెంబరు 11 రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలతో జరిగిన ఆస్తి, ప్రాణ నష్టాన్ని అంచనా వేసి జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన వెలువరించారు.

మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

కాటారం, సెప్టెంబరు 11 : మండలంలోని గంగారం మోడల్ స్కూల్‌ను కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ బుధవారం తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా రూ.34 లక్షల నిధులతో చేపట్టిన పనులను పరిశీలించారు. ఇప్పటి వరకు ప్రారంభం కాని పనులను వెంటనే చేపట్టాలని ఏఈ తిరుపతిని ఆదేశించారు. పనులను నాణ్యతతో త్వరగా పూర్తిచేయాలని స్వశక్తి సంఘాల మహిళలకు సూచించారు. మోడల్ స్కూల్ హాస్టల్‌లోని సమస్యలను పరిష్కరించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపీవో వీరస్వామిని ఆదేశిం చారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం రవీందర్ ఉన్నారు.

చెరువుల శిఖం భూములను పరిరక్షించాలి

మండల కేంద్రంలోని పలు చెరువుల శిఖం భూములు అన్యక్రాంతమవుతున్నాయని, వాటిని పరిరక్షించాలని బీఆర్ఎస్ నేత జక్కు శ్రావణ్ అన్నారు. సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్‌ను కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల కలెక్టర్ రాహుల్ శర్మకు సైతం ఫిర్యాదు చేశానని, తగిన చర్యలు చేప ట్టాలని కోరారు. కాటారం ఊర చెరువు, తిమ్మన్నకుంట, ఎర్ర చెరువు శిఖంభూములను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు.

పేదలకు కూడు, గూడు కల్పించని ప్రభుత్వాలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్ వెస్లీ

వాజేడు, సెప్టెంబరు 11: పేదలకు కూడు, గూడు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్ వెస్లీ విమర్శించారు. మండల కేంద్రంలోని గుడిసె వాసుల పోరాట శిబిరాన్ని ఆయన బుధవారం సందర్శించారు. గుడిసెవాసులు ప్రథమ వార్షికోత్సవ సభను నిర్వహించగా వెస్లీ హాజరయ్యారు. పేదలంతా ఏకమై, తెలంగాణ సాయుధ రైతంగా పోరాటం స్ఫూర్తితో శ్రామిక రాజ్య స్థాపనకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గుడిసెవాసుల పోరాటం తెలంగాణ సాయుధ పోరాటాన్ని గుర్తు చేస్తోందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు అవుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు మౌలిక సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, వర్గ సభ్యులు బీరెడ్డి సాంబశివ, ఎండీ దావూద్, మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు, నాయకులు దామోదర్, దేవయ్య, కృష్ణబాబు, ముత్తయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై అంగన్‌వాడీలు దృష్టి పెట్టాలి

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 11: చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణపై అంగన్‌వాడీలు ప్రత్యేక దృష్టి పెట్టాలని భూపా లపల్లి సీడీపీవో అవంతిక అన్నారు. మండ లంలోని పర్లపల్లి అంగన్‌వాడీ కేంద్రం-1లో బుధ వారం పోషణ మాసోత్సవం కార్యక్రమం జరగగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేం ద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, చిన్నారులు, గర్భిణులు క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలు సాధారణ స్థితికి వచ్చేవరకు అంగన్ వాడీలు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతోనే ఆరోగ్యం

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబరు 11: సమతుల్య ఆహారంతోనే చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో ముత్తమ్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చర్ల్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం జరగగా ఆమె పాల్గొన్నారు. గర్భిణులు, బాలిం తలు, చిన్నారులు రోజువారీగా ఆకుకూరలు, చిరుధాన్యాలు, గుడ్లు, పాలు, పప్పులు ఎక్కువగా తీసుకోవాలన్నారు. బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లల పట్ల అంగన్‌వాడీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు చంద్రకళ, విజేందర్, అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరి, సరస్వతి, భాగ్యలక్ష్మి, కృష్ణకుమారి, వెంకటరమణ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు స్థలానికి హద్దుల ఏర్పాటు

కాటారం, సెప్టెంబరు 11 : మండల కేంద్రం శివారులోని కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ స్థలానికి బుధవారం హద్దులు ఏర్పాటు చేశారు. ఇటీవల అధికారులు సర్వే చేయగా భూమి ఆక్రమణకు గురైనట్లు తేలింది. మంగళవారం సబ్‌కలెక్టర్ ఏఎంసీని సందర్శించి స్థల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో ఏఎంసీ కార్యదర్శి షరీఫ్ సిబ్బందితో స్థలం చుట్టూ ఏర్పాటు చేసిన హద్దురాళ్లకు ఏఎంసీ పేరును రాయించారు. కబ్జాకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ కార్యాలయ సిబ్బంది మల్లికార్జున్, సంపత్‌రావు, నారాయణ, సలీం, సత్యం తదితరులు పాల్గొన్నారు.

గొత్తికోయగూడాల్లో పోలీసుల కార్డన్‌సెర్చ్

తాడ్వాయి, సెప్టెంబరు 11: మండలంలోని కొండపర్తిగుంపు, జనగలంచ గొత్తికోయగూడాల్లో స్థానిక ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా పరిశీలించి గొత్తికోయల వివరాలను సేకరించారు. అనంతరం ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి గొత్తికోయలను సమావేశపరిచి మాట్లాడారు. గొత్తికోయలు ప్రశాంత వాతావరణంలో జీవనం గడపాలని, కొత్త వ్యక్తులు, అపరిచిత వ్యక్తులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. మావో యిస్టులకు సహకరించొద్దని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీసులను ఆశ్రయిం చాలని అన్నారు. గూడాల్లోని గొత్తికోయలు సైబర్ నేరాల బారిన పడవద్దని, అడవుల్లో చెట్లను నరకవద్దని అన్నారు. అనంతరం ఎనిమిది నుంచి పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను పంపిణీ చేశారు. కాటాపూర్ క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానితుల నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించి పంపించారు. ఈ కార్యక్రమాల్లో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను పూర్తి చేయాలి

డీఎంహెచ్‌వో అప్పయ్య

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 11: జిల్లాలోని 500 గ్రామాలకుగాను 445గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించామని, మిగిలిన గ్రామాల్లో రెండు రోజుల్లో పూర్తి చేయాలని వైద్యాధికారులు, సిబ్బందిని డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయం నుంచి ఆయా పీహెచ్‌సీల వైద్యులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వైద్యశిబి రాల్లో గర్భిణుల నమోదును వందశాతం చేపట్టాలని, వ్యాధి నిరోధక కార్యక్రమ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని అన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

టీపీయూ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

చిట్యాల, సెప్టెంబరు 11: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూ) జిల్లా అధ్యక్షుడు ములకల తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలో చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమానికి బుధవారం ఆయన హాజరయ్యారు. ఈకార్యక్రమంలో ఉపా ధ్యక్షులు గోపగాని భాస్కర్, జిల్లా బాధ్యులు బుర్ర సదయ్య, నాయకులు మనోహర్, రఘుపతి, శ్రీనివాస్, సతీష్, మమత తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో గెలిచిన సంఘాలకు శిక్షణ తరగతులు

కాకతీయఖని, సెప్టెంబరు 11: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలుపొందిన కార్మిక సంఘాల నాయకులకు త్వరలోనే శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ కేంద్ర కమి టీ ఉపాధ్యక్షుడు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర సహాయక కార్యదర్శి పసు నూటి రాజేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడిచిన పదేళ్లల్లో బీఆర్ ఎస్ ప్రభుత్వం సింగరేణిలో గెలిచిన సంఘాలకు శిక్షణ తరగతులు ఇప్పిం చిన దాఖలాలు లేవని విమర్శించారు. కార్మిక సంఘాల నేతలతో శిక్షణ తరగతులు ఇప్పించేందుకు సీఎండీ బలరాంనాయక్‌తో మాట్లాడి ఒప్పిం చిన ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌కు కృతజ్ఞ తలు తెలి పారు. శిక్షణ తరగతులు త్వరలోనే ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా ఉపాధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



మనోహర్



సందీప్

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 11: జాతీయ మానవ హక్కుల కమిటీ(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఉపాధ్య క్షుడిగా మల్యాల మనోహర్, జనరల్ సెక్రటరీగా గన్నెర్ల సందీప్, వెంకటా పూర్(రామప్ప) మండల అధ్యక్షు రాలిగా చింతల మమతలను నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు పాల్తియా రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయండి : సీపీఐ

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 11: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఈనెల 17 వరకు జిల్లాలోని గ్రామగ్రామాన విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ కోరారు. ములుగులో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలపై పోరాటాలను ఉధృతం చేయాలని, తెలంగాణకు స్వాతంత్ర్యం కమ్యూనిస్టుపార్టీ ద్వారానే వచ్చిందని అన్నారు. వారంరోజులపాటు జిల్లాలో జరిగే రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు ముత్యాల రాజు, లావుడ్యా రాములు, ఇనుముల భిక్షపతి, రఘు, రొంటాల రమేష్, లెంకల రాజు, సారంగం, మహేష్, కుమార్, నరేష్, రాకేష్, ప్రశాంత్, కుమార్, అరవింద్, రామస్వామి, భాస్కర్ పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల నిరసన

గోవిందరావుపేట, సెప్టెంబరు 11: గ్రామీణ వైద్యులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ మండలకేంద్రంలో ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు బొబ్బ మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జన్నారపు రమేష్‌లు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్యసేవలందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు ప్రభుత్వమే శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందించాలని, ప్రస్తుతం జరుగుతున్న దాడులను నిలిపివే యాలని, ప్రథమ చికిత్స చేసే అవకాశం ఇవ్వాలని, గౌరవ వేతనం రూ.3 వేలు అందించాలని, గుర్తింపుకార్డు అందించాలని డిమాండ్ చేశారు. ఈకార్య క్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు బొబ్బ మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జన్నారపు రమేష్, ఉపాధ్యక్షుడు బర్రి శ్యాంబాబు, నాయకులు రాజేందర్, యానాల వెంకటరెడ్డి, గ్రామీణ వైద్యులు గోపిశెట్టి ఐలయ్య, శివమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై కేరళ బృందం సమీక్ష

ఏటూరునాగారం, సెప్టెంబరు 11: ఏటూరునాగారం మండలంలో వివిధ పథకాల ద్వారా వచ్చిన నిధులతో జరిగిన అభివృద్ధి పనులపై నేషనల్ రిసోర్స్ ఆర్గనైజేషన్ (ఎన్ఆర్‌వో) సెర్ప్ విభాగం కేరళ రాష్ట్ర బృందం బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశమైంది. బృందం సభ్యులు ఎమ్మీ. సఫ్దర్, ప్రియాంక తదితరులు ఆయా శాఖల అధికారులను మండల అభివృద్ధి, గ్రామ స్థాయిలో జరిగిన పనుల వివరాలను వారు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీవో కుమార్, మెడికల్ ఆఫీసర్ సుమలత, ఐసీడీఎస్ సీడీపీవో ప్రేమలత, డీపీఎం సి.హెచ్. వేణుగోపాల్‌రెడ్డి, ఐటీడీఏ ఏటీడీవో దేశిరావు, ఎంఈవో మల్లయ్య, ఏపీఎం సతీష్‌కుమార్, ఐటీడీఏ ఏపీవో చరణ్‌రాజ్, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, గ్రామపంచాయతీ కార్యదర్శి రమాదేవి, మండల స్పెషల్ ఆఫీసర్ సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ మండల కార్యవర్గం ఎన్నిక

చిట్యాల, సెప్టెంబరు 11: ఎస్‌టీయూ మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దాసారపు రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా బొమ్మ రాజమౌళి, ఉపాధ్యక్షుడిగా మంగళపల్లి చిరంజీవి, కార్యదర్శిగా రాజు ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు ప్రవీణ్, జిల్లా అధ్యక్షులు రమేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి గణేష్, నీలిమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా గాలిబ్



రేగొండ, సెప్టెంబరు 11: బీజేవైఎం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా మం డలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గాలిబ్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి బుధవారం ప్రకటించారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

గోవిందరావుపేట, సెప్టెంబరు 11: మండలంలోని దుంపెల్లిగూడెం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. వైఆర్‌జీ కేర్ సంస్థ లింక్ వర్కర్ టి.కిషన్ మాట్లాడుతూ హెచ్ ఐవీ, ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అన్నారు.. హెచ్ ఐవీ రోగిని ప్రేమతో ఆదరించాలే తప్ప వివక్ష చూపకూడదని సూచించారు.